సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం ǀ 22 ǀ ఏప్రిల్ ǀ 2023



వైభవోపేతంగా అష్టోత్తర కళశాభిషేకం

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో అష్టోత్తర కళశాభిషేకాన్ని నిర్వహించారు. -IIలో..



ప్రభుత్వ సాయం.. వారికి వరం

ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో తలెత్తుకుని గౌరవంగా జీవించడానికి ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు చేపడుతోంది. -IIలో..



టీ-20 మ్యాచ్‌లు ప్రారంభం

కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్ పురుషుల టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. -IIలో..

న్యూస్‌రీల్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: మత సామరస్యానిక ప్రతీక రంజాన్ పండుగ అని.. ముస్లిం సోదరులందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా రంజాన్ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని.. ప్రతి ముస్లిం సోదరులు అల్లా కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

కడప సెవెన్‌రోడ్స్ : పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ విజయ రామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రత, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేళవింపే రంజాన్ పర్వదినమని తెలిపారు. అందరికీ అల్లాహ్ ఆశీస్సులు అందాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

25లోగా ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులకు 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షల ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. వాటికి సంబంధించిన ఫీజులను చెల్లించాలని వైఎస్సార్ జిల్లా డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఇంకా చెల్లించని వారు ఈనెల 25వ తేదీలోగా డీసీఈబీ కార్యాలయంలో చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు.

పాఠశాల విద్య ఆర్‌జేడీగా వెంకటకృష్ణారెడ్డి



కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్య ఆర్‌జేడీగా మర్తాల వెంకటకృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించింది. గతంలో కడప ఆర్‌జేడీగా పనిచేస్తున్న ఈయనను మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించి బదిలీ చేసింది. తర్వాత ఆయన స్థానంలో ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిని ఎఫ్‌ఏసీ ఆర్‌జేడీగా నియమించింది. తిరిగి కడప ఆర్‌జేడీగా వెంకటకృష్ణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులను విడుదల చేసింది. దీంతో ఎఫ్‌ఏసీ ఆర్‌జేడీగా పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డిని రిలీవ్ చేసింది. వెంకటకృష్ణారెడ్డి ఈనెల 23వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

లక్కిరెడ్డిపల్లి: వైద్యులు ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర ఆరోగ్య పరిశీలకులు డాక్టర్ శశాంక్ శర్మ, డాక్టర్ అరుణ్ ఎస్ కదం పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని కమ్యూనిటీ ఆసుపత్రిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈసీజీ ల్యాబ్, ఎక్స్‌రే, కాన్పుల ఓపీ, రోగుల విశ్రాంతి గదులను పరిశీలించారు.

పెరటింట.. ప్రకృతి పంట

- ఇంటి ఆవరణ, ఖాళీ స్థలాల్లో కిచెన్‌గార్డెన్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం
- సెంటు నుంచి ఐదు సెంట్ల స్థలంలో కూరగాయల సాగు
- స్వయం సహాయక, గ్రామ సంఘాల సమన్వయంతో ఏర్పాటు



కలసపాడు మండలం సిద్ధుమూర్తిగారి పల్లెలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కిచెన్‌గార్డెన్

కడప అగ్రికల్చర్: నేడు ఏది చూసిన కల్తీమయంగా మారింది. బయటి వస్తువులను కొని తినాలంటేనే జనాలు జంకుతున్నారు. ఏ పంటలకు ఏరకమైన పురుగు మందులను వాడుతున్నారో... ఏ రకమైన రసాయనిక ఎరువులు వేస్తున్నారో తెలియని భయాందోళన మధ్య నిత్యావసర సరుకులు, కూరగాయలను కొనాల్సి వస్తోంది. ఈ తరుణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలను తినేందుకు ప్రజలు ఆసక్తిని చూపుతున్నారు. దీంతోపాటు ప్రకృతి వ్యవసాయ విభాగం వారు ఒక సెంట్ నుంచి ఐదు సెంట్ల ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్స్, ఇంటి ఆవరణలో న్యూట్రీగార్డెన్స్, ఇంటపైన టెర్రస్ గార్డన్స్ పేరుతో రకరకాల కూరగాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది.ప్రకృతి వ్యవసాయం విస్తృత ప్రచారం కల్పిస్తోంది. ఇందుకు సంబంధించిన విత్తనాల సరఫరాను కూడా ఈ విభాగం వారు అందిస్తున్నారు. స్వయ సహాయక, గ్రామ సంఘాల సహకారంతో దీనిని ప్రోత్సహిస్తున్నారు. దీంతో చాలామంది ఇంటి ఆవరణలో కొద్దిపాటి స్థలం ఉన్నా కిచెన్‌గార్డెన్‌లను పెంచేందుకు అసక్తి చూపుతున్నారు. రసాయనిక, పురుగుమందుల వాడకానికి స్వస్తి పలికి ప్రభుత్వ సూచనలతో ప్రకృతి వ్యవసాయంపై చాలా మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు విభాగం ప్రోత్సాహంతోపాటు వారి సూచనలు, సలహాలతో కూరగాయల సాగుకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు.

ఆరోగ్యమే మహాభాగ్యం...

నేడు చాలా మంది ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతున్నారు.ఇందులో భాగంగా పురుగుమందులు, రసాయనిక ఎరువులు వాడకుండా పండించిన కూరగాయలు, ఆకుకూరలు తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేని కలుషిత రహిత ఆహారం తినడం వల్ల ఆర్యోగం బాగుంటుందని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. దాని ద్వారా వచ్చే ఆకుకూరలు, కూరగాయలను వాడుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

జిల్లాలో 51,170 కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు...

ప్రకృతి వ్యవసాయ విభాగం గణాంకాల ప్రకారం జిల్లాలో ఇప్పటికే 51,170 కిచెన్ గార్డెన్స్ ఏర్పాటయ్యాయి. ఇందులో భూమిలేని పేదలు సైతం తమ ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో నేచురల్ ఫార్మింగ్ ద్వారా పలు రకాల కూరగాయల పంటలను సాగు చేశారు. దీంతోపాటు అక్కడక్కడ న్యూట్రీషియన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్స్‌ను కూడా సాగు చేశారు.

రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా...

రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కిచెన్‌గార్డెన్స్‌ను నిర్వహిస్తున్నారు. ఎరువుల స్థానంలో ఘన జీవామృతం పేరుతో దేశవాళీ ఆవు పేడ, ఆవుమూత్రం, బెల్లం, పప్పుదినుసుల పండి, గుప్పెడు పొలం గట్టు చివరి మట్టి లేదా అడివిమట్టి ఇలా అన్ని పదార్థాలను కొద్దిగా ఆవు మూత్రం కలిపి మిశ్రమాన్ని ముద్దలుగా తయారు చేసి వాడుతున్నారు.

జీవామృత ఎరువులతో కూరగాయల సాగు



ఇంటి వద్ద మూడు సెంట్లలో బీట్‌రూట్, కొత్తిమిర, బెండకాయలు తదితర కూరగాయలను సాగు చేశాం. దీంతో మా ఇంటి అవసరాలను తీర్చుకోవడంతోపాటు ఇరుగు పొరుకు వారికి కూడా అందిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంతో వీటి సాగుకు పురుగుముందులు, రసానిక ఎరువులు వాడటం లేదు. పశువుల పేడ, జీవామృతం తదితర వాటితో కూరగయాలు పండిస్తున్నాం.

-కె. సరస్వతి, సిద్ధమూర్తిపల్లె గ్రామం. కలసపాడు

విటమిన్స్, మినరల్స్ లభ్యమవుతాయి



ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల పంటలను పండించేలా చూస్తున్నాం. ఇంటి ఆవరణతోపాటు ఇంటిపైన ఖాళీస్థలంలో కూరగాయల సాగు చేయిస్తున్నాం. పురుగుముందులు, రసాయనిక ఎరువులు వాడకుండా పండించిన కూరగాయలు తినడం వల్ల శరీరానికి కావాల్సిన మిటమిన్స్, మినరల్స్ లభ్యమవుతాయి. దీంతో ఆర్యోగం బాగుటుంది. అందుకే చాలామందిని కూరగాయల సాగుకు ప్రోత్సహిస్తున్నాం.

– సంధ్య, హెల్త్ అండ్ న్యూట్రీషన్ మాస్టర్ ట్రైయినర్. కలసపాడు.

పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం...



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటితోటల పెంపకాన్ని ప్రొత్సహిస్తున్నాం. పురుగుముందులు, రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం జీవామృతం, ఘన జీవామృతాలనే వాడే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో ఇప్పటికి 50 వేలకు పైగా కిచెన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేశాం. కిచెన్ గార్డెన్‌ల సాగుకు రైతులు కూడా ముందుకు వస్తున్నారు. వారికి అవగాహన కల్పిస్తుస్తూ విత్తనాలను అందిస్తున్నాం.

– రామకృష్ణరాజు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయం

26న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 26వ తేదీన ఉదయం 9 గంటలకు జెడ్పీలో నిర్వహిస్తున్నామని సీఈఓ ఎం.సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, ప్రణాళిక, ఆర్థిక, పనుల స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ సభ్యులంతా నిర్దేశిత సమయానికంటే గంట ముందు హాజరు కావాలని కోరారు. శాఖాపరమైన ప్రగతి నివేదికలతో జిల్లా అధికారులు సమావేశానికి రావాలని తెలిపారు.

సర్టిఫికెట్ల అందజేత



చెమ్మియాపేట బాలికల హైస్కూల్ హెచ్‌ఎంకు సర్టిఫికెట్ ఇస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఇన్‌స్పైర్ మనాక్ 2021-22 విద్యా సంవత్సరానికి వైఎస్సార్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికై ఆన్‌లైన్‌లో తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులు, గైడ్ టీచర్లకు డీఈఓ రాఘవరెడ్డి జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి సర్టిఫికెట్లు అందించారు. రాష్ట్రస్థాయిలో పాల్గొన్న 29 మంది విద్యార్థులు, వారిని ప్రొత్సహించిన గైడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులకు డీఈఓ అభినందనలు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన చెమ్మమియాపేట పాఠశాల విద్యార్థి షేక్ ఫైజాసుల్తానా, గైడ్ టీచర్ సోఫియా, ప్రధానోపాధ్యాయురాలు మేరీలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం కూడా ఇన్‌స్పైర్ మనాక్‌కు ఎక్కువ నామినేషన్లు జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆక్షాంక్షించారు.

వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు, సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని, వీటిని లాభాల బాటలో నడిపించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే) ద్వారా విస్తృత సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల రబీ సీజన్‌లో సాధారణ సాగుబడి 77.76 శాతాన్ని అధిగమించి వంద శాతానికి పెంచగలిగామన్నారు. రబీలో వచ్చిన పంటల దిగుబడిని పౌరసరఫరాల సంస్థ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ఆర్‌బీకేల్లో ఏర్పాట్లు చేశామన్నారు. వ్యవసాయ సహాయకులు సీజన్ వారీగా పంటలు, తెగుళ్ల నివారణ, ఎరువుల వాడకం, పోషక విలువలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహాబోర్డు చైర్మన్ పి.శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో మార్కెట్ కమిటీలు మూలస్తంభాల్లాగా పనిచేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ప్రగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు వివరించారు. ఉద్యాన శాఖ రూపొందించిన కరపత్రాలను అధికారులు విడుదల చేశారు. జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన సేవలు అందించాలి

సివిల్ సర్వీస్ అధికారుల సేవలు సమాజానికి ఆదర్శవంతం కావాలని, ఆ దిశగా ప్రతి సివిల్ సర్వెంట్ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం ౹ 16వ నేషనల్ సరీ్వసెస్ డేని పురస్కరించుకుని కలెక్టర్, ఎస్పీ అన్బురాజన్, జేసీ గణేష్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, ఏఎస్పీ తుషార్ డూడిలు ప్రతిజ్ఞ నిర్వహించారు.

వరాల పండగ...ఆనందం నిండగా..

- నేడు ఈద్-ఉల్-ఫితర్
- ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలలో ఏర్పాట్లు



కడపలోని బిల్టప్ ఈద్గాలో వేసిన చలువ పందిరి

కడప కల్చరల్: దైవం కారుణ్యం చూపిస్తాడని..జన్మ సాఫల్యం లభిస్తుందని..సాటి మనిషిని ఆదుకునే అవకాశం కలుగుతుందని..ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా..ఎదురుచూసే పండుగ. ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువలు పెంచే పండుగ రంజాన్. ఈ పవిత్రమైన పండుగ కోసం నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేశారు. శుక్రవారం నెలవంక దర్శనంతో ముస్లిం పెద్దలు పండుగను శనివారం చేసుకోవాలని సూచించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ముస్లింలు పండుగ ఏర్పాట్లలో మునిగిపోయారు. ఉపవాస దీక్షలతో, ప్రత్యేక ప్రార్థనలతో ముస్లింలు ఈ మాసం ప్రత్యేకతను నిలిపారు. ఈ నెలంతా పూర్తిగా ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. నిర్ణీత సమయానికి మసీదులకు వెళ్లి నమాజులు చేశారు. నెలవంక కనిపించడంతో మసీదుల్లో తరావీ ప్రార్థనలు ముగించారు. ప్రత్యేకంగా విచ్చేసిన గురువుల ఆధ్వర్యంలో సాగిన ఖురాన్ పఠనం పూర్తి చేశారు. ఎదురుచూసిన వరాల వసంతం వచ్చేయడంతో పండుగ నిర్వహణకు సిద్ధమయ్యారు. మసీదు కమిటీల ఆధ్వర్యంలో పండుగ ప్రత్యేక ప్రార్థనల నిర్వహణ కోసం తగిన ఏర్పాట్లు చేశారు. మసీదుల వద్ద కంటే ఈద్గాలలో ప్రార్థనలు నిర్వహించేందుకే ఎక్కువ మంది భక్తులు రానున్నారు. కడప వాసులు బిల్టప్ ఈద్గా, ఆలంఖాన్‌పల్లె వద్దగల దండు షాహీ ఈద్గా, జమాల్‌పల్లె, మాచుపల్లె, రిమ్స్ వద్దగల ఈద్గాలలో పండుగ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇందుకోసం కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. మైనార్టీశాఖ, కార్పొరేషన్ అధికారులు ఈద్గా మైదానాలను చదును చేసి పారిశుధ్య పనులు నిర్వహించారు. ప్రార్థనలకు వచ్చే వారి కోసం తాగునీరు, వజూ చేసుకునేందుకు నీటి సదుపాయం, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

సీఎం కృషితో మెగా మార్కెట్



కాంక్రీట్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషితో రాష్ట్రంలోనే ప్రొద్దుటూరులో పెద్ద కూరగాయల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రూ.53 కోట్లతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ నిర్మాణంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కాంక్రీట్ (పుటింగ్) పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున 2.36 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో కూరగాయల మార్కెట్ నిర్మాణం జరుగుతోందన్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేయడానికి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. మార్కెట్ అంతా బురదమయంగా ఉండేదన్నారు. దీంతో కొత్త మార్కెట్ నిర్మించాలనే లక్ష్యంతో ఉన్న దానిని తొలగించామన్నారు. 2021 డిసెంబర్ 23న మార్కెట్ నిర్మాణానికి శిలాఫలకం వేయగా, ఇది శిలాఫలకాలకే పరిమితమైందని, సాంకేతిక అనుమతులు, పరిపాలన అనుమతులు రాలేదని ప్రచారం చేశారన్నారు. అంతకుముందు మార్కెట్ నిర్మాణంలో జాప్యం జరగడంతో ఈ స్థలాన్ని రిలయన్స్ సంస్థకు తాను అమ్ముకున్నానని టీడీపీ నేతలు దుష్ప్రచారం చేశారన్నారు. ఇక మీకు వ్యాపారాలు ఉండవని వ్యాపారులను తప్పుదోవ పట్టించారన్నారు. వ్యాపారులందరూ ఇతరుల మాటలు వినకుండా ఐకమత్యంతో సహకరించినందు వల్లే కొత్త మార్కెట్ నిర్మాణం సులువుగా జరుగుతోందన్నారు. రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, సెల్లార్‌లో 125 కార్లు, లేదా 675 ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, ఏఈ ఉమామహేశ్వరి, కేసీపీ కంపెనీ అధినేత అనిల్, ఆప్కాబ్, పద్మశాలి కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు మల్లేల ఝాన్సీరాణి, జింకా విజయలక్ష్మి, టీటీడీ పాలకమండలి సభ్యుడు మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'కదులుతున్న డొంక'పై ఆరా

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వైద్య సిబ్బంది నియామకం తదితర అంశాలకు సంబంధించిన అవకతవకలపై 'సాక్షి'లో శుక్రవారం 'కదుతులున్న డొంక' అనే కథనం ప్రచురితమైంది. ఇది జోన్-4 (రాయలసీమ) జిల్లాల వైద్య ఆరోగ్య శాఖలో ప్రకంపనలు సృష్టించింది. ఈ అంశంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. కాగా ప్రభుత్వం అవినీతికి ఆస్కారం లేకుండా పలు చర్యలు చేపట్టింది. అక్రమాలు..ఆరోపణలపై దర్యాప్తు బృందాలతో సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగు చూస్తాయని ఆ శాఖకు చెందిన ఉద్యోగులు, నిరుద్యోగులు అంటున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

హత్యాయత్నంపై కేసు

కొండాపురం : మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా యవజన విభాగం ప్రధాన కార్యదర్శి ఆర్.హరి నారాయణరెడ్డిపై గురువారం రాత్రి జరిగిన హత్యాయత్నానికి సంబంధించి ఇద్దరిపై తాడిపత్రి తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదైంది. బాధితుడు హరినారాయణరెడ్డి స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీలో కీలక నేతగా ఉంటూ సమస్యలపై కృషి చేస్తూ ప్రజాదరణ పొందడంతో ఓర్వలేక తమ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎస్.రామసుబ్బారెడ్డి, ఎస్.చిన్నఅంకిరెడ్డి వర్గీయులు హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తూ, అర్హత కలిగిన వారికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలు వచ్చేలా చేయడంతో గ్రామంలో ప్రజా దరణ పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తాళ్లప్రొద్దుటూరు నుంచి బొందలదిన్నె గ్రామంలోని తమ ఇంటికి దగ్గరకు వచ్చి కారు ఆపిన వెంటనే.. బొలేరో క్యాంపర్‌తో వచ్చి ఢీకొట్టారన్నారు. తాను కారులోనే ఉండటంతో ప్రాణహాని తప్పిందని తెలిపారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ప్రభుత్వ సాయం.. వారికి వరం

- ప్రత్యేకంగా జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు
- ఆర్థిక స్వావలంబనకు స్వయం ఉపాధి శిక్షణలు
- స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు
- చులకన భావన, అవహేళనల నుంచి ఆత్మగౌరవం వైపు 'ట్రాన్స్‌జెండర్స్' అడుగులు

సమాజంలో అందరూ మనుషులే... అంతా సమానులే! అందులో 'ట్రాన్స్‌జెండర్స్' (హిజ్రాలు) కూడా ఒక భాగమే. వారు కూడా అందరిలాగా ప్రాణమున్న మనుషులే. అయితే వారి పట్ల సమాజంలో చులకన భావన ఉంది. ఈ నేపథ్యంలో 'థర్డ్ జెండర్'గా పిలువబడే వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. దీంతో మొదటిసారిగా వారి సం'క్షేమం' నవ సమాజంలోకి అడుగులు వేస్తోంది. దీంతో ఆ వర్గాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటుతో గౌరవంగా జీవిస్తున్నామమ్మా అంటూ వారు సంతోష పడుతున్నారు.


ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్న ట్రాన్స్‌జెండర్స్

జిల్లాల వారీగా ట్రాన్స్‌జెండర్స్ వివరాలు

	వైఎస్సార్	అన్నమయ్య
గుర్తింపు పొందిన వారు	113	100
పింఛన్లు పొందుతున్న వారు	123	93
జగనన్న కాలనీల్లో గృహాలు		
పొందిన వారు	47	40
ఉపాధి శిక్షణ పొందిన వారు	34	16

కడప రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లింగబేధం లేకుండా అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో తలెత్తుకుని గౌరవంగా అందరికీ సమానంగా జీవించడానికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వం చొరవతో ట్రాన్స్‌జెండర్స్ ఆత్మగౌరవం వైపుగా ముందడుగు వేస్తున్నారు.

స్వశక్తితో ఎదగడానికి

'చేపలను ఉచితంగా ఇవ్వడం కంటే.. పట్టడం నేర్పించడం ఉత్తమం' అనేది చైనా దేశస్తుల అభిప్రాయం. కాగా ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్ ఒకరిపైన ఆధారపడకుండా స్వశక్తితో ఎదగడానికి తోడ్పాటు ఇచ్చింది. ఆ మేరకు సిండికేట్ బ్యాంకు ఆధ్వర్యంలో డ్రైవింగ్, బ్యూటీషియన్ తదితర ఆసక్తి గల రంగాల్లో ఉచిత శిక్షణను ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ వారి జీవన విధానంలో సరికొత్త మార్పులను తీసుకు రావడానికి దోహదపడింది. ఈ శిక్షణ ద్వారా కొంత మంది ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. స్వశక్తితో జీవిస్తూ పలువురు ట్రాన్స్‌జెండర్స్‌కు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు దిశగా..

మహిళా స్వయం సహాయక సంఘాలు ఎంతటి అభివృద్ధి పథంలో నడుస్తున్నాయో ప్రతి ఒక్కరం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటిని పోషించుకోగలుగుతున్నారు. ఇది గమనించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్స్‌తో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా వారిని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లడానికి చర్యలు చేపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 సంఘాలు ఉండగా, అందులో కడప నగరంలో ఒక గ్రూపు ఏర్పాటైంది.

అర్హులు ఉంటే పింఛన్ మంజూరు

గత తెలుగుదేశం పార్టీ హయాంలో హిజ్రాలకు ఇచ్చే పింఛన్లు నామమాత్రంగానే ఉండేవి. కొత్త పింఛన్ల మంజూరు అసలు ఉండేది కాదు. ఆ ప్రభుత్వంలో ఒకరికి నెలకు రూ.1500, కొద్ది నెలలు రూ.2000 మంజూరు చేశారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పింఛన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ. 3000లకు పెంచారు. అలాగే అర్హులు ఎంత మంది ఉన్నా ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో నిరుపేదలైన ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక తోడ్పాటు లభించినట్లయింది.

అభివృద్ధే ధ్యేయంగా..

చాలా మందిలో ట్రాన్స్‌జెండర్స్ పట్ల ఒక విధమైన చులకన, తక్కువ భావన ఉంటుంది. ట్రాన్స్‌జెండర్స్‌లో ఎంతో మంది ఉన్నతమైన వారు, విద్యావంతులు, సమాజానికి మేలు చేయాలన్న సంకల్పం కలిగినవారు ఉన్నారు. అయితే వారిలోని దయాగుణాన్ని చాలామంది గమనించడం లేదనే అభిప్రాయం ఉంది. చాలా ప్రాంతాలలో ట్రాన్స్‌జెండర్స్ దీవించినా, వారు శుభ కార్యాల్లో పాల్గొంటే అంతా మంచి జరుగుతుందనే అభిప్రాయం చాలామందిలో ఉంది. ఈ అంశాలను చాలా మంది ఆచరిస్తుంటారు కూడా. కొద్దిమందిలో మాత్రమే వారిపట్ల తక్కువ భావన ఉంది. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌జెండర్స్‌లో అవగాహన కల్పించడంతోపాటు ఇతరుల్లో వారి పట్ల చులకన భావనను తొలగించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా వారి సం'క్షేమం' కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గూడు కోసం..

ప్రతి ఒక్కరూ సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తుంటారు. ఇది గమనించిన ప్రభుత్వం జగనన్న కాలనీల ద్వారా పెద్ద ఎత్తున పేదలకు ఇంటి నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగా ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా అవకాశం కల్పించారు. కాగా లే అవుట్లలో అన్ని వర్గాలకు చెందిన వారు నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. అయితే కొంత మంది ట్రాన్స్‌జెండర్స్ కేటాయించిన లే అవుట్లలోనే తమకు ప్రత్యేకంగా అవకాశం కల్పించాలని కోరారు. వారి కోరిక మేరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వైఎస్సార్ జిల్లాలో మొత్తం 47 మందికి ఇంటి స్థలాలు కేటాయించగా, అందులో కడప నగరంలోని లే అవుట్‌లో 17 మందికి ఒకే చోట ఇంటి నిర్మాణం చేపట్టేలా అవకాశం కల్పించారు. ఇలా రాష్ట్రంలో పలు చోట్ల వారి అభ్యర్థన మేరకు వెసలుబాటును కల్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో సొంతింటి కల సాకారం అయినందుకు ట్రాన్స్‌జెండర్స్‌లో సంతోషం నెలకొంది.



ప్రభుత్వ చర్యలు అభినందనీయం



ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. మాకు ఇంటి స్థలాలు మంజూరు చేశారు. ఉపాధి శిక్షణలను ఇచ్చారు. పెన్షన్లు వస్తున్నాయి. అయితే మా సంక్షేమానికి మరింతగా చర్యలు చేపట్టాలి. ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలి.

– అనన్య, తిలక్‌నగర్, కడప

అభివృద్ధికి ప్రత్యేక ప్రతిపాదనలు



ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక, ఉపాధి రంగాల్లో పునరావాసం కల్పించడానికి ప్రత్యేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారికి రుణాలను మంజూరు చేయడానికి, స్వయం సహాయక సంఘాల్లో చేర్పించి బ్యాంకుల ద్వారా ప్రత్యేకంగా రుణాలు ఇప్పించడానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమానికి ప్రత్యేకంగా చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని ట్రాన్స్‌జెండర్స్‌గా పరిగణించడం జరుగుతోంది.

– క్రిష్ణ కిశోర్, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా దివ్యాంగులు, హిజ్రాల సంక్షేమశాఖ

విధి చిన్న చూపు


భాస్కర్ (ఫైల్)


భావన, తేజ వంశీ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన భాస్కర్ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. భాస్కర్ అనే వ్యక్తి కుల వృత్తి చేసుకుంటూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయనకు భార్య శ్రీలత, కుమారుడు తేజ వంశీ, కుమార్తె భావన ఉన్నారు. భాస్కర్ భార్య శ్రీలత అనారోగ్యంతో బాధపడుతూ రెండు నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి పిల్లలు భావన, తేజ వంశీని తనే పెంచుతున్నాడు. ఈ నేపథ్యంలో భాస్కర్‌కు కూడా శరీరంలోని అన్ని భాగాలు దెబ్బతినడంతో మెరుగైన చికిత్స కోసం కడప ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆరోగ్య పరిస్థితి విషమించి రెండు రోజుల క్రితం మృతి చెందాడు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రా మానికి మృతదేహాన్ని తీసుకొచ్చి బంధువులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు కూడా కొంత మంది గ్రామస్తులు ఆర్థిక సాయాన్ని అందించారు.

అనాథలైన పిల్లలు

తల్లిదండ్రులు రెండు నెలల వ్యవధిలోనే మృతి చెందడంతో చిన్న పిల్లలైన భావన, తేజ వంశీ అనాథలుగా మారారు. ప్రస్తుతం చిన్నపిల్లలు గ్రామంలో ఉన్న తన బాబాయ్ వద్ద ఉంటున్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఆప్తులు, దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలువలో పడి వృద్ధురాలి మృతి

పెద్దముడియం : మండల పరిధి పెద్దపసుపుల గ్రామ పొలాల్లోని మైలవరం దక్షిణ కాలువలో ఓ వృద్ధురాలు పడి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండసుంకేసుల గ్రామానికి చెందిన పెద్ద హుసేన్ బీ(63) తన భర్త, ఇద్దరు కుమారులు మృతి చెందడంతో చిన్నపసుపుల గ్రామంలోని చిన్నకోడలు హుసేన్‌బీ దగ్గర ఉంటోంది. పెద్ద హుసేన్ బీకి మతి స్థిమితం సరిగా లేకపోడంతో ఇంటి నుంచి అప్పుడప్పుడూ వెళ్లి మళ్లీ తిరిగివచ్చేది. నాలుగు రోజుల క్రితం కూడా ఇలాగే వెళ్లిన ఈమె పెద్దపసుపుల గ్రామ పొలాల్లో తిరుగుతూ ఉండేది. శుక్రవారం ఉదయం కాలువలో మహిళ శవం ఉండడంతో గ్రామస్తులు పోలీసులకు తెలపడంతో.. చిన్నపసుపుల గ్రామానికి చెందిన పెద్ద హుస్సేన్‌బీగా గుర్తించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

పెద్దముడియం : మండలంలోని బోడుతిప్పలపాడు గ్రామంలో బొట్టు శ్రీక్రిష్ణ (26) అనే యువకుడు ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, శివమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన శ్రీ క్రిష్ణ ఇంటి దగ్గరే ఉంటూ పొలం పనులకు వెళ్లేవాడు. శుక్రవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని బావిలో ఈత కొట్టడానికి వెళ్లాడు. బావిలో ఈత కొట్టుతుండగా అకస్మాత్తుగా మునిగిపోయి చనిపోయాడని స్నేహితులు తెలిపారు. శ్రీక్రిష్ణ మృతదేహానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు కష్టపడాలి


భార్గవ్‌రెడ్డిని మొక్క అందించి ఆహ్వానిస్తున్న విద్యార్థిని

కమలాపురం : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని విధించుకుని ఆ లక్ష్య సాధనకు నిరంతర కృషి చేయాలని భారతి సిమెంట్ కార్పోరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఐఆర్ అండ్ పీఆర్ చీఫ్ మేనేజర్ భార్గవ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాప సిబ్బంది మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


కడపలో అశోక హోటల్‌పై దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వున్న అశోక హోటల్‌పై ఈ నెల 20వ తేదీన రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. లోపలికి ప్రవేశించి అక్కడున్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై హోటల్ మేనేజర్‌గా పనిచేస్తున్న మహీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు తెలియజేశారు. ఈ హోటల్‌కు సంబంధించి యాజమాన్యానికి, నిర్వాహకులకు మధ్య విభేదాలున్నట్లు సమాచారం.

కడప డిపోలోని స్టాల్స్‌కు టెండర్లు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో ఖాళీగా ఉన్న స్టాల్స్/షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని కడప డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు/వ్యాపార సంస్థలు కడప డిపో కార్యాలయం నుంచి టెండరు దరఖాస్తులు పొంది సీల్డ్ కవర్స్‌ను డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో మాత్రమే వేయాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


మృతి చెందిన సిసీంద్రీరెడ్డి

వేంపల్లె : వేంపల్లె మండలం అలవలపాడు గ్రామానికి చెందిన శిరిగిరెడ్డి సిసీంద్రిరెడ్డి(23) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అలవలపాడు గ్రామానికి చెందిన రేణుక, పుల్లారెడ్డి దంపతులకు శ్రీకాంత్‌రెడ్డి, సిసీంద్రీరెడ్డి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. రెండవ కుమారుడు సిసీంద్రీరెడ్డి చిత్తూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంసీఏ చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం సెమిస్టర్ పరీక్షలు రాసి స్వగ్రామమైన అలవలపాడు గ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సొంత పని నిమిత్తం వేంపల్లెకు వచ్చి రాత్రికి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా అయ్యవారిపల్లె సమీపంలో రోడ్డు మలుపు కనిపించకపోవడంతో అతివేగంగా బైకులో వస్తున్న సిసీంద్రీరెడ్డి ఎదురుగా ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టాడు. తలకు పెద్ద గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జాతీయ సంఘంలో బీసీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో తమకు పదవులు వచ్చినట్లు బీసీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీవీ రాజు తెలిపారు. శుక్రవారం బీసీ సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘంతో బీసీ సమాఖ్య అనుబంధంగా కొనసాగడానికి సంఘం ప్రతిపాదించిందన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు ప్రతిపాదనను ఆమోదించి సమాఖ్యలోని నాయకులను పలు పదవులు ఎంపిక చేశారన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా బీవీ రాజు, వెంకటకృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా జింకా రాజశేఖర్, కాలే దేవానంద్, వుట్టి తిరుపతయ్య, కార్యదర్శిగా విజయకుమార్, సంయుక్త కార్యదర్శులుగా శశిధర్, మొరగుడి చంద్రబాబులను ఎంపిక చేశారని చెప్పారు.

సౌత్‌జోన్ టీ-20 మ్యాచ్‌లు ప్రారంభం


మ్యాచ్ ఆడుతున్న కడప, కర్నూలు జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్ పురుషుల టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 35 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్‌లతో 72 పరుగులు, పి.గిరినాథ్‌రెడ్డి 39 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 55 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ మహేష్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 20 ఓవర్లలో 162 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని అశ్విన్ హెబ్బార్ 52 పరుగులు చేశాడు. అనంత బౌలర్ వినయ్‌కుమార్ 4 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం జట్టు 24 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

కడప జట్టు విజయం

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. జట్టులోని డి.నరేన్‌రెడ్డి 35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 51 పరుగులు చేశాడు. ధృవకుమార్‌రెడ్డి 25 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్‌లతో 45 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాత్విక్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 65, దేవేంద్ర 55 పరుగులు చేశారు. కడప బౌలర్లు నరేన్‌రెడ్డి 2, సుదర్శన్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో కడప జట్టు 22 పరుగుల తేడాతో విజయం సాధించింది.

వైభవోపేతంగా అష్టోత్తర కలశాభి షేకం


కామాక్షీ వైద్యనాథుల గ్రామోత్సవం

వల్లూరు : పుష్పగిరి శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అష్టోత్తర కలశాభిషేకాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర ప్రయుక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకం కార్యక్రమాలు చేశారు. అగ్ని ప్రణయనం చేసి పారమాత్మక హోమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పరిహారాల కోసం బింబశుద్ధితో 108 కలశాలను ఏర్పాటు చేసి గోదావరి పుష్కర, తుంగభద్ర, కృష్ణ, కావేరీ, ప్రయాగ, త్రివేణీ సంగమ, కాశీ గంగ, రామేశ్వర తీర్థం, పెన్నా నదులలోని పుణ్య జలాలు, విశేష ద్రవ్యాలు, ఆవు పాలు, నెయ్యి, తేనె, సర్వ పోదకం, అక్ష తోదకం, కుషోదకం, రత్నోదకం, మృన్మయ జలం, కషాయం, పుష్పోదకం, హరిద్రోదకం, గంధోధకంలతో నింపి 108 మంది దేవతలను ఆవాహన చేశారు. అనంతరం కలశాలలోని ద్రవ్యాలతో శ్రీ చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. నిత్య, ఉక్త హోమాలను నిర్వహించారు. రాత్రి శ్రీ చెన్నకేశవస్వామి పెద్ద శేష వాహనంపై కొలువు దీరగా మంగళ వాయిద్యాల నడుమ దివిటీల వెలుగులో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవి అమ్మవారికి కుంకుమార్చనలను నిర్వహించారు. రాత్రి శ్రీకామాక్షీ వైద్యనాథేశ్వర స్వామికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, రాజేశ్వర శర్మ, సుబ్బయ్య స్వామి, ఉభయదాతలు నాగెళ్ల మహేంద్రారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

నేడు చందనోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి చందనోత్సవం అత్యంత ఘనంగా జరుగుతుంది. రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతాయి. రాత్రి శ్రీ వైద్యనాథస్వామికి నెమలి వాహన సేవ జరుగుతుంది.

సర్వమత సమ్మేళనమే మనదేశ గొప్పతనం


ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్ననాయకులు

ఖాజీపేట : దేశంలో చాలా మతాలు ఉన్నా, అందరూ మతసామరస్యం పాటించి పండుగలు జరుపుకోవడం భారతదేశం గొప్పతనమని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. అందుకే భిన్నత్వంలో ఏకత్వం మన దేశంలోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఖాజీపేటలోని మసీదులో జిల్లా కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా శుక్రవారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ గౌస్‌ఆజం పాల్గొన్నారు.

ముస్లింలు ఉపవాసదీక్ష విరమించిన అనంతరం వారు పండ్లు తినిపించారు. భోజనం స్వయంగా వడ్డించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ శనివారం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, పుల్లూరు మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, చెన్నముక్కపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ బండి శ్రీనివాసులు తోపాటు మండలంలోని నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	23	59,655
నిఫ్టీ	0	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,191	▼	425
బంగారం (22 క్యారెట్)	59,950	▼	423
వెండి (కేజీ)	74,773	▼	646

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్ అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358-00
వరంగల్	360-00
రిటైల్ ధర	4.20

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.


హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 - 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్‌ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్‌లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ


జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-ఓజస్ రెండో రౌండ్‌లో 159-157తో మరియా-గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్ నూర్‌ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్-భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3-5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6-4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6-4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్స్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ




బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే


కాన్వే


జడేజా

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే అదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం:** 1-87, 2-110, 3-122. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్‌రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్' మార్క్‌లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విట్టర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?

సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.